ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
మంగళవారం 2 జనవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	220	240
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.132	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.6 । కనిష్ఠం 16.0

ఖజానాకు కిక్కు



న్యూ ఇయర్ ఖర్చు రూ.61కోట్లు

గత ఏడాది చివరి రెండు రోజుల్లో మద్యంపై రూ.55కోట్లు

పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ, కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు డిసెంబరు 31న చిన్నా పెద్ద తేడా లేకుండా ఉమ్మడి జిల్లా ప్రజలు ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. మహిళలు అర్ధరాత్రి వరకు ముగ్గులేస్తూ గడిపారు. పెద్దలు, పిల్లలు కేక్ కట్‌చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యువతీ యువకులు జోష్‌గా వేడుకలు నిర్వహించారు. ఇక మద్యం ప్రియుల సందడి అంతా ఇంతా కాదు. మందు, ముక్కతో అర్ధరాత్రి దాటేంతవరకు సంబరాలు చేసుకున్నారు. అందుకు తగ్గట్టుగానే వ్యాపారులు ముందస్తుగా ఏర్పాట్లు చేశారు. న్యూఇయర్ కేకుల కోసం బేకరీ, స్వీట్ల దుకాణాలు, మద్యం కొనుగోళ్లతో వైన్స్ దుకాణాల్లో సందడి నెలకొంది. మొత్తంగా న్యూ ఇయర్ పేరుతో డిసెంబరు 30, 31న ఉమ్మడి జిల్లా వాసులు రూ.61కోట్లు ఖర్చు చేశారు. అందులో ఒక్క మద్యానికే రూ.55కోట్లు ఖర్చయింది. - కోదాడ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 299 మద్యం దుకాణాలు ఉన్నాయి. నల్లగొండ మద్యం డిపో పరిధిలో నల్లగొండ జిల్లాతోపా టు, సూర్యాపేట జిల్లా జిల్లాకు మద్యం సరఫరా అవుతుంది. ఘట్‌కేసర్ మద్యం డిపో పరిధిలో యాదాద్రి జిల్లాకు మద్యం సరఫరా అవుతుంది. కాగా, డిసెంబరు 30న నల్లగొండ మద్యం డిపో పరిధిలో 23,400 కాటన్ల బీర్లు, యాదాద్రి పరిధిలో 15,108 కాటన్ల బీర్లు మొత్తం 38,508 కాటన్ల బీర్ల విక్రయాలు జరిగాయి. వీటి వ్యయం రూ.22.50కోట్లు. అదే విధంగా నల్లగొండ మద్యం డిపో పరిధిలో 22,000 మద్యం కేసులు, యాదాద్రి పరిధిలో 14,642 కేసులు, మొత్తం 36, 640కేసుల మద్యం విక్రయాలు జరిగాయి. వాటిపై చేసిన ఖర్చు రూ.14.92కోట్లు. మొత్తంగా 30వ తేదీన మద్యంపై ఉమ్మడి జిల్లావాసులు చేసిన ఖర్చు రూ.37.42కోట్లు. ఇక సంవత్సరాంతం 31వ తేదీన నల్లగొండ డిపో పరిధిలో 16,400 కాటన్ల బీర్లు, యాదాద్రి పరిధిలో 6,586 కాటన్లు, మొత్తం 22,986 కాటన్ల బీర్ల విక్రయాలు జరిగాయి. వీటిపై మద్యం ప్రియులు చేసిన ఖర్చు రూ.10.55కోట్లు. అదే విధంగా నల్లగొండ డిపో పరిధిలో 9,750 మద్యం కేసులు, యాదాద్రి పరిధిలో 7,469కేసులు, మొత్తం 17,219కేసుల మద్యం విక్రయాలు జరిగాయి. వీటిపై చేసిన ఖర్చు రూ.7.47లక్షలు. చివరి రోజు మొత్తం మద్యంపై చేసిన ఖర్చు రూ.18.2కోట్లు. 30వ తేదీతో పోల్చితే 31న ఆదివారం కావడంతో మద్యం విక్రయాలు రూ.19.40కోట్ల మేర తగ్గాయి. మొత్తంగా న్యూ ఇయర్ పేరుతో డిసెంబరు చివరి రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో మద్యం ప్రియులు రూ.55.44కోట్లు ఖర్చు చేశారు.

అదనంగా రూ.5.97కోట్లు

ఉమ్మడి జిల్లాలో సుమారు 150 రెస్టారెంట్లు, హోటల్స్, 240 చికెన్ దుకాణాలు, 120 బేకరీలు, 144 స్వీట్ దుకాణాలు ఉన్నాయి. ఆయా దుకాణాల్లో డిసెంబరు 31న రెస్టారెంట్స్, హోటళ్లలో సుమారు రూ.1.20కోట్ల విక్రయాలు జరిగాయి. చికెన్ అమ్మకాలు రూ.1.72కోట్లు, బేకరి ఐటమ్స్‌పై రూ.1.80కోట్లు, స్వీట్స్‌పై రూ.1.80కోట్లు, మొత్తంగా ఒక్క రోజులో ఉమ్మడి జిల్లావాసులు బేకరి, చికెన్ ఐటమ్స్‌పై రూ.5.72కోట్లు ఖర్చు చేశారు. వీటికి మటన్, ఫిష్, మహిళలు రంగులకు చేసిన ఖర్చు మరో రూ.25లక్షలు అదనం. మొత్తంగా రూ.5.97కోట్లు ఖర్చయ్యాయి. డిసెంబరు 31న ఉమ్మడి జిల్లా వాసులు మద్యంపై రూ.18.2 కోట్లు, బేకరి, ఇతర ఐటమ్స్‌పై రూ. 5.97కోట్లు మొత్తంగా, రూ.24.17కోట్లు ఖర్చు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసుల కన్నెర్ర

ఉమ్మడి జిల్లాలో రెండు రోజుల్లో 297 కేసులు నమోదు

నూతన సంవత్సర వేడుకల పేరుతో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ఉమ్మడి జిల్లా పోలీసులు కొరడా ఝుళిపించారు. శనివారం రాత్రి 8గంటల నుంచే ఉమ్మడి జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించడం ప్రారంభించారు. అర్ధరాత్రి దాటాక కూడా పోలీసులు పరీక్షలు నిర్వహించారు. శని, ఆదివారం రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో 297 డ్రంకెన్ డ్రైవ్ కేసులను పోలీసులు నమోదు చేశారు. అదేవిధంగా వేడుకల పేరుతో న్యూసెన్స్ సృష్టించిన 194 మందిపై కేసు నమోదు చేశారు.



జిల్లా	డ్రంకెన్‌డ్రైవ్ కేసులు	న్యూసెన్స్ కేసులు
నల్లగొండ	146	126
సూర్యాపేట	90	68
యాదాద్రి	61	-
మొత్తం	297	194

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు



ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఏసీపీ, పోలీసు అధికారులు

భువనగిరి టౌన్, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలను ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు జిల్లా ప్రజలు ఉత్సాహంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నూతన సంవత్సర సంబరాలు కొనసాగాయి. సంవత్సరం తొలి రోజు దైవ దర్శనాలతో ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ప్రత్యేక పూజల్లో పాల్గొని ఈ ఏడాదంతా ఆనందంగా ఉండాలని వేడుకున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షల పోస్టింగ్‌లతో సోషల్ మీడియాను హోరెత్తించారు. మద్యం, మాంసం విక్రయ దుకాణాలు, బేకరీ లు, స్వీట్ హౌస్‌లలో రోజంతా కొనుగోళ్లు సాగాయి. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పచ్చల కట్ట సోమేశ్వరాలయంలో నూతన సంవత్సర పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐలు ఎస్.సుధీర్‌కృష్ణ, బి.సత్యనారాయణ తదితర కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం తొలిరోజున పెద్ద సంఖ్యలో పర్యాటకులు భువనగిరి ఖిల్లాను సందర్శించారు. పర్యాటకులతో భువనగిరి ఖిల్లాపై సందడి నెలకొంది. పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. అయితే చలి తీవ్రత నూతన సంవత్సరం వేడుకలపై ప్రభావం చూపింది. సాధారణంగా డిసెంబరు 31 సాయంత్రం నుంచి జనవరి 1 తెల్లవారు జాము వరకు కాలనీలు, పార్కులు తదితర ప్రాంతాల్లో సంబరాలు జరిగేవి. అర్ధరాత్రి 12 గంటలకు రహదారులపైకి వచ్చి బాణాసంచా కాలుస్తూ చిందులు వేసేవారు. కానీ చలి తీవ్రత కారణంగా ఈ ఏడాది సంబరాలు తగ్గాయి. అలాగే కేక్‌లు, బాణాసంచా, మాంసం విక్రయాలు కూడా ఆశించిన స్థాయిలో జరగలేదని వ్యాపారులు చెబుతున్నారు.

కొత్త ఏడాది వేళ విషాదాలు

- వేర్వేరు ప్రమాదాల్లో ఉమ్మడి జిల్లా వాసులు ముగ్గురు మృతి, మరో నలుగురికి గాయాలు
- ముగ్గరి ఆత్మహత్య.

• 7లో..

గవర్నర్‌కు యాదగిరీశుడి అర్చకుల ఆశీర్వాదం



రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ దంపతులను ఆశీర్వదిస్తున్న యాదాద్రి అర్చక బృందం

యాదగిరీశుడిని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు



యాదగిరిక్షేత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు

యాదగిరిగుట్ట, జనవరి 1: యాదగిరీశుడిని నూతన సంవత్సరాదిని సీఎం రేవంత్ రెడ్డి సోదరులు అనుముల రవీందర్‌రెడ్డి, అనుముల రాజవర్ధన్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారి వెంట హైదరాబాద్ కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి దేవాలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బీర్ల, అనిల్



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కుంభం, కుమారుడు, కూతురు

యాదగిరిగుట్ట రూరల్, భువనగిరి టౌన్, జనవరి 1: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో సీఎం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండాసురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రధానార్చకుడు ఎన్.లక్ష్మీనరసింహాచార్యులు, అర్చక బృందం ఆశీర్వచనం చేయగా ఈవో రామకృష్ణారావు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గుట్ట అభివృద్ధిలో నిలిచిపోయిన పనులు, స్థానిక సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్టు బీర్ల తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ చీర శ్రీశైలం, కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేశం, గుండ్లపల్లి భరత్‌గౌడ్, ఆలయ అధికారులు జి.రఘు, రాజన్‌బాబు ఉన్నారు. అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఆయన కుమారుడు శ్రీరాంరెడ్డి, కూతురు కీర్తిరెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతీ గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడపాలి

మంత్రికి విప్ బీర్ల వినతిపత్రం



మంత్రి పొన్నంను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 1: ఆలేరు నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడిపించాలని రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదివారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి స్పందించి మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడిపించేందుకు చర్యలు తీసుకుంటానని చెబుతూ వెంటనే సంబంధిత ఆర్టీసీ అధికారులకు ఫోన్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్టు బీర్ల తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.



అంతర్జాతీయ ఆధ్యాత్మికక్షేత్రం

అడుగడుగునా అవస్థలే

విశ్వవిఖ్యాత పర్యాటక, పుణ్యక్షేత్రం, మహాద్భుత శిల్పకళా సౌధంగా రూపుదిద్దుకున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో భక్తులను అడుగడుగునా సమస్యలు వేధిస్తున్నాయి. స్వయంభు పాంచనారసింహుడు కొలువుదీరిన ప్రధానాలయ ఉద్ఘాటన జరిగి సుమారు రెండేళ్లయినా క్షేత్రంలో నెలకొన్న సౌకర్యాల లేమి యాత్రికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొండకింద లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, వాహన పూజలు, సత్యనారాయణస్వామి వ్రత మండపంతో పాటు ఉచిత అన్నప్రసాద వితరణ సేవలు, కొండపైన హరిహరుల దర్శనాలు, ఆర్జిత సేవల నిర్వహణతో పాటు స్వామివారి ప్రసాదాల విక్రయ కేంద్రం ఉండగా, ఏ సేవలు ఎక్కడ ఉంటాయో క్షేత్రానికి వచ్చిన యాత్రికులకు తెలియక నానా తంటాలు పడుతున్నారు. కొండపైకి చేరుకున్న తర్వాత వీఐపీ దర్శనాలు, ధర్మదర్శనాలకు ఎలా వెళ్లాలో భక్తులకు తెలియడం లేదు. వేసవి వచ్చిందంటే కొండపైన కాలుతున్న బండలతో భక్తులు నరకయాతన పడుతున్నారు. - యాదగిరిగుట్ట

- సమస్యగా మారిన దర్శన క్యూకాంప్లెక్స్
- మొక్కు టెంకాయ సమర్పణకూ ఇక్కట్లు
- బస్సుల కోసం భక్తుల పాట్లు
- చినుకు పడితే చింతే
- వేధిస్తున్న పార్కింగ్ సమస్య

యాదగిరీశుడి దర్శనాలకు వచ్చిన భక్తులు ప్రధానాలయంలోనికి చేరుకునేందుకు కొండపైన ఈశాన్య దిశలో నాలుగు అంతస్థుల్లో దర్శన క్యూకాంప్లెక్స్‌ను వైటీడీఏ నిర్మించింది. వాస్తవానికి ఈ కాంప్లెక్స్‌ను క్యూకాంప్లెక్స్ కోసం కాకుండా సత్యనారాయణస్వామి వ్రత పూజల కోసం నిర్మించారు. అయితే గత సీఎం కేసీఆర్ తన పర్యటన సందర్భంలో వాస్తు ప్రకారం ఈశాన్యంలో ఎత్తు ఎక్కువగా ఉండొద్దని దర్శన క్యూకాంప్లెక్స్ పైభాగంలోని నిర్మాణాన్ని తొలగించాలని అధికారులకు సూచించగా తొలగించారు. అప్పటి నుంచి ఈ కాంప్లెక్స్‌ను ధర్మదర్శన క్యూకాంప్లెక్స్‌గా మార్పు చేసిన అధికారులు అందుకు అనుగుణంగా నాలుగు అంతస్థుల్లో ఐరన్ క్యూలైన్లను ఏర్పాటుచేశారు. ఆలయ ఉద్ఘాటన అనంతరం క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులు ఈ కాంప్లెక్స్ గుండా తూర్పు తిరుమాఢవీధిలోని లోహపు క్యూలైన్ బాక్సుల నుంచి ప్రధానాలయంలోనికి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. అప్పటి నుంచి దర్శన క్యూకాంప్లెక్స్ నుంచి భక్తులు ఇష్టదైవాల దర్శనాలకు వెళ్తున్నారు. ఇదిలా ఉండగా ఈ దర్శన క్యూకాంప్లెక్స్ పక్కనే వృద్ధులు, చంటిపిల్లల తల్లులు, దివ్యాంగుల కోసం ఎస్కలేటర్ ఏర్పాటు చేసినా దాన్ని వినియోగించుకునే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు అంతస్థుల్లోని క్యూకాంప్లెక్స్‌ను దాటుకుని ప్రధానాలయ తూర్పు దిశలోని గోల్డెన్ క్యూలైన్ బాక్సు గుండా నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సివస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భక్తులు, స్థానికుల నుంచి విమర్శలు రావడంతో తేరుకున్న దేవస్థాన అధికారులు వీఐపీ పార్కింగ్ ప్రాంతం ముందు తాత్కాలిక టికెట్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్‌లో వీఐపీ బ్రేక్ దర్శనాలు, వీఐపీ టికెట్లను రూ.150కు విక్రయిస్తున్నారు. టికెట్లు పొందిన భక్తులు బాలాలయం పక్కన ఉన్న ర్యాంపు మీదుగా దర్శన క్యూకాంప్లెక్స్‌లోనికి చేరుకుని అక్కడ నుంచి గోల్డెన్ క్యూలైన్ లోకి, అక్కడి నుంచి ప్రధానాలయంలోనికి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. అయితే రూ.150 టికెట్ కొనుగోలు చేసిన భక్తులు నడిచే ప్రాంతంలో ఐరన్‌షెడ్, లేదా సిమెంట్ కాంక్రీట్‌తో శాశ్వత కట్టడం నిర్మించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

టెంకాయ సమర్పణా సమస్యే

ఇష్టదైవాల దర్శనానికి ముందుగా భక్తులు మొక్కు టెంకాయలు సమర్పించడం అనాదిగా వస్తున్న ఆచారం. కొండపైకి చేరుకున్న భక్తులు టెంకాయలను ఎక్కడ కొట్టాలో తెలియకపోవడం ఓ సమస్య అయితే, రూ.150 వీఐపీ దర్శన టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు టెంకాయలు కొనుగోలు చేసినా మొక్కు చెల్లించుకోలేని పరిస్థితి నెలకొంది. దర్శన క్యూకాంప్లెక్స్ గుండా ధర్మదర్శనాలకు వెళ్లే భక్తులు మాత్రం మార్గ మధ్యంలో ఉన్న క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మొక్కుటెంకాయ సమర్పణకు దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ విషయం తెలియక ధర్మదర్శనాల్లో వెళ్లే కొందరు భక్తులు కొనుగోలు చేసిన టెంకాయలను తీసుకువెళ్తుండగా, ప్రధానాలయ తూర్పురాజగోపురం వద్ద దేవస్థాన సిబ్బంది వాటిని తీసుకొని పక్కన పెడుతున్నారు. దీంతో మొక్కు చెల్లించుకోలేకపోతున్నామని దేవస్థాన అధికారుల తీరుపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇతర దేవస్థానాల్లో మాదిరిగా టెంకాయ సమర్పణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు.

బస్సుల కోసం పాట్లు

యాదగిరికొండకు కొండంత ఆశతో వచ్చే భక్తులకు ఆర్టీసీ బస్సుల కోసం నిరీక్షించే బాధ తప్పడంలేదు. క్షేత్ర సందర్శనకు వచ్చిన భక్తజనులను స్వయంభు దర్శనాలకు కొండపైకి వెళ్లేందుకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో చేరవేస్తున్నారు. అయితే భక్తులు అధిక సంఖ్యలో తరలిరా వచ్చిన ప్రతీసారి ఆర్టీసీ బస్సులు సరిపోక ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సుల కోసం భక్తులు గంటల తరబడి వేచివుండాల్సి వస్తోంది. ఉన్న బస్సుల్లో ఫుట్‌బోర్డు పైనా కిక్కిరిసి నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తోందని,రద్దీ సమయంలో ఎక్కువ సంఖ్యలో బస్సులు నడపాలని భక్తులు కోరుతున్నారు. పరిమితికి మించి బస్సుల్లో ప్రయాణం చేయాల్సి రావడంతో యాత్రాజనుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటోందని, అంతేగాక ప్రమాదాల బారిన పడే అవకాశాలూ ఉన్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్కింగ్ సమస్య

యాదగిరికొండపైన సరైన పార్కింగ్ ప్రదేశాలు లేక రద్దీ, విశేష రోజుల్లో పార్కింగ్ సమస్య తలనొప్పిగా మారింది. ఆలయ పునర్నిర్మాణ సమయంలో మాస్టర్ ప్లాన్‌లో కొండపైన భక్తుల వాహనాలకు తగినంత పార్కింగ్ ఏర్పాట్లు చేయలేదు. సాధారణ రోజుల్లో వాహనాల సంఖ్య వెయ్యిలోపు, సెలవు, విశేష రోజుల్లో ఈ సంఖ్య దాదాపు 1,500 నుంచి 2,000 చేరుతోంది. అయితే కొండపైన బస్‌బే, మొదటి ఘాట్‌రోడ్‌తో పాటు పడమటి దిశలోని పార్కింగ్ ప్రాంతంలో భక్తుల వాహనాలను అధికారులు పార్కింగ్ చేయిస్తున్నారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో వాహనాల్లో తరలివస్తుండడంతో ఈ సమస్య మరింత జఠిలంగా మారుతోంది. ఈ క్రమంలో అధికారులు కొంత సేపు కొండపైకి వాహనాలను అనుమతించకుండా కొండకిందే నిలిపి వేస్తున్నారు. కొండ పైనుంచి వాహనాలు వెళ్లిన తర్వాత తిరిగి భక్తుల వాహనాలను కొండపైకి అనుమతిస్తున్నారు.



కొండకింద పార్కింగ్ ప్రాంతంలో వరదలో భక్తుల వాహనాలు

చినుకు పడితే చింతే

యాదగిరికొండపై కొద్దిపాటి వర్షానికే ప్రధానాలయ అష్టభుజి ప్రాకారమండపాల నుంచి వర్షపు నీరు కారుతోంది. కొండకింద గండి చెరువు సమీపంలోని ప్రాంతం వరద నీటితో మునిగిపోతుండడంతో పాటు ఊరకుంట చెరువు ప్రాంతం నుంచి వరద ప్రవహించి లోతట్టులోని యాదగిరిపల్లి, ఎస్సీ కాలనీలను ముంచెత్తుతోంది.

వేధిస్తున్న సమస్యలు

దర్శనాలకు ఎలా వెళ్లాలో తెలియని ఇబ్బందులు.. మరోవైపు దర్శనానంతరం కొండపైన సేద తీరేందుకు సరైన సౌకర్యాలు లేక యాత్రాజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాగిరికొండపైన మండల దీక్షలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. అయితే ఆలయ పునర్నిర్మాణంతో క్షేత్రంలో మండల దీక్షలు చేసే అవకాశం లేకుండా పోయింది. స్వామివారి ప్రసాదాలు కొనుగోలు చేసే భక్తులు ప్రసాదవిక్రయశాలలో క్యూలైన్ ఏర్పాట్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. ధర్మదర్శన కూలైన్‌లో భక్తులు ఇబ్బందులు పడుతున్నట్టు తాజాగా క్షేత్రాన్ని సందర్శించిన దేవాదాయశాఖ కమిషనర్ అనీల్‌కుమార్ స్వయంగా గుర్తించారు. దివ్యాంగులు, వృద్ధులు, చంటిపిల్లల తల్లులు ఇష్టదైవాల దర్శనాల కోసం అవస్థలు ఎదుర్కొంటున్నారు. యాదగిరిక్షేత్రాన్ని వచ్చే ఎ



లాంటి అసౌకర్యాలు కలగకుండా శాశ్వత ప్రణాళికలు రూపొందించి సమస్యలను పరిష్కరించాలని భక్తులతోపాటు స్థానికులు కోరుతున్నారు.

గుట్టెక్కించండి స్వామీ

- కొండపైకి ఆటోలకు అనుమతి కోసం ఎదురుచూపులు

• 6లో..

ఎన్నికల నామ సంవత్సరంగా 2024

- సార్వత్రిక ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు
- తేలనున్న సుమారు 18,661మంది నాయకుల రాజకీయ భవితవ్యం

• 7లో..

నెట్‌బాల్ పోటీల్లో నల్లగొండ జిల్లా క్రీడాకారుల సత్తా

ట్రెడీషనల్‌లో బాలురు, ఫాస్ట్ ఫైవ్‌లో బాలికలు విజేతలు

నాగార్జునసాగర్, జనవరి 1: సాగర్ హిల్‌కాలనీలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆరో రాష్ట్ర స్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో బాల బాలిక విభాగంలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి విజేతలుగా నిలిచారు. రాష్ట్రంలోని 22 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా, ట్రెడీషనల్ విభాగంలో బాలురు, ఫాస్ట్ ఫైవ్ విభాగంలో బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. ట్రెడీషనల్ విభాగంలో జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో నారాయణపేట జట్టు నిలిచింది. బాలికల విభాగంలో మేడ్చల్ ప్రథమ స్థానంలో నిలవగా, జిల్లా జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఫాస్ట్ ఫైవ్ బాలుర విభాగంలో నారాయణపేట ప్రథమ స్థానంలో నిలవగా, మహబూబ్‌నగర్ ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, మేడ్చల్ ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన ఆయా జిల్లా జట్లు జాతీయ స్థాయిలో ఆడతాయని జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కిరణ్‌కుమార్ తెలిపారు. సాయంత్రం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా యువజన సర్వీసుల క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ మాట్లాడు తూ, క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రమాదిత్యరెడ్డి, ఉపాధ్యక్షుడు సారత్ ఖాన్, మనోజ్‌కుమార్, ఖాజాఖాన్, విశ్రాంత పీఈటీ అనురాధ, హెచ్‌ఎం సిస్టర్ అన్నమ్మ, నిర్వాహకులు మిట్టపల్లి శ్రీనివాస్, రాజగోపాల్‌రెడ్డి, పేరయ్య, శ్రీనివాస్, నాయాన్, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు విక్రమాదిత్యరెడ్డి





గుట్టెక్కించండి స్వామీ

- కొండపై ఆటోలకు అనుమతి కోసం ఎదురుచూపులు
- ఎన్నికల సభలో ఆటో కార్మికులకు హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి
- మూడేళ్లుగా దుర్భర జీవితాలు గడుపుతున్నామని ఆవేదన
- ఈఎంఐ, చిట్టీలు చెల్లించలేని పరిస్థితి



గుట్టలో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 1: యాదగిరికొండపై ఆలయ పునర్నిర్మాణంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లు తమ మొర నూతన సంవత్సరంలోనైనా నెరవేరాలని కోరుకుంటున్నారు. కొండపైకి తమ ఆటోలను అనుమతించి, తమ కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలని వేడుకున్నారు. రాష్ట్రంలో గతేడాది నూతనంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తమ ఆశలు నెరవేరాలని ఎదురుచూస్తున్నారు. గతంలో కొండపైకి భక్తులను చేరవేస్తూ జీవనోపాధి పొందేవారు. గత ప్రభుత్వం కొండపైకి ఆటోలను నిషేధించడంతో జీవనోపాధి కోల్పోయామని మూడేళ్లుగా పోరాటం చేస్తున్నారు. సాధారణ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీపీసీసీ చీఫ్ హోదాలో రేవంత్‌రెడ్డి సైదాపురం గ్రామంలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ కొండపై ఆటోలను అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో ఆటో డ్రైవర్లు రేవంత్ రెడ్డి హామీ అమలు కోసం ఎదురుచూస్తున్నారు. గుట్ట కింద ఆటోలు నడుపుకుంటూ సుమారు 300 మంది డ్రైవర్లు జీవనోపాధి పొందుతున్నారు. సుమారు 600కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. గతంలో ప్రతి రోజూ ఆటోలు నడుపుకుంటూ పిల్లల చదువులు, ఆటోలపై అప్పులుగా తీసుకున్న ఈఎంఐలు చెల్లింపు, ఇంటి అద్దె, చిట్టీలు కట్టేవారు. ఆటోలు నడిపితేనే కుటుంబాలను పోషించేకునేవారు. ఫైనాన్స్ అధికారుల ఒత్తిళ్లు, ఇంటి అద్దె చెల్లించకపోవడం, చిట్టీలు చెల్లించకపోవడంతో తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా ధర్నాలు,ఆందోళనలు చేసినా ఫలితం లేదు.కొండపైకి ఆటోలు నడపడాన్ని రద్దు చేసినప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు.మాజీ సీఎం కేసీఆర్ గుట్టకు వచ్చినప్పుడు ఆయనను స్వయంగా కలుస్తామని ప్రయత్నించినా తమను అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.తర్వాత ఆయనను కలుద్దామని చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు.

30 ఏళ్లుగా భక్తులకు సేవలందించాం



యాదాద్రి కొండపైకి ఆర్టీసీ బస్సులు లేనప్పుడు 30సంవత్సరాల నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొనేందుకు వచ్చే భక్తులకు సేవలు అందించాం. ఎన్ని సేవలు అందించినా, గుట్ట అభివృద్ధికి తమ తోడ్పాటు అందించినప్పటికీ ఫలితం లేదు.

- బాకీ మొగులయ్య, ఆటో డ్రైవర్.

సీఎం అనుమతి కోసం ఎదురు చూస్తున్నాం



గత నెలలో జరిగిన ఎన్నికల సభలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్మికులను ఆదుకుంటామని విప్ అయిలయ్య కూడా భరోసా ఇచ్చారు. కొండపైకి ఆటోలు వెళ్లేందుకు అనుమతి ఇప్పించి మా కుటుంబాలను ఆదుకుంటారని ఎదురుచూస్తున్నాం. కొత్త ప్రభుత్వంపై మాకు నమ్మకం ఉంది.

- మల్సూర్ పాషా, ఆటో కార్మికుడు.

ఈఎంఐలు, ఇంటి అద్దె చెల్లించలేకపోతున్నాం



కొండపైకి ఆటోలను రద్దు చేసినప్పటి నుంచి రోజూవారీగా వచ్చే ఆదాయం లేకపోవడంతో ఈఎంఐలు, ఇంటి అద్దె, చిట్టీల డబ్బులు, పిల్లల ఫీజులు చెల్లించలేక వారి ఒత్తిళ్లు భరించలేకపోతున్నాం. దీంతో కుటుంబాలు వీధిన పడి పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.అప్పటి అధికారులు,ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం మాకొంపలు ముంచింది. ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య కొండపైకి అనుమతి ఇప్పించాలని ఎదురుచూస్తున్నాం.


- గుండ్లపల్లి అలివేలు, ఆటో డ్రైవర్ భార్య

నకిరేకల్ బైపాస్ రోడ్డులో

మంత్రి పొంగులేటికి ఘనస్వాగతం

నకిరేకల్, జనవరి 1 : హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్న రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సోమవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ బైపాస్ రోడ్డులో ఘనంగా స్వాగతం పలికారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వీరేశం స్థానిక శివాలయం, షిర్డీసాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో లయన్స్‌క్లబ్, సెంటీనియల్ లయన్స్‌క్లబ్ నవ్య సంయుక్తంగా నిర్మిస్తున్న నూతన భవనంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాలలో పూజార్ల శంభయ్య, దైద రవీందర్, పన్నాల రాఘవరెడ్డి, గాజుల సుకన్య, యాస కర్నాకర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు డాక్టర్ మోహన్‌రెడ్డి, బొల్లం కృష్ణమూర్తి, ఉప్పల వెంకటరమణ, బాణాల రాంరెడ్డి, పోతుల రాములు పాల్గొన్నారు.





ఉమ్మడి జిల్లాలో న్యూఇయర్ జోష్

నూతన సంవత్సర వేడుకలు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అంబరాన్ని తాకాయి. ఆదివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు వేడుకలు నిర్వహించిన యువత, నూతన సంవత్సరం ప్రారంభం కాగానే కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదేవిధంగా సోమవారం ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాలు, అన్ని ప్రాంతాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొన్నిచోట్ల బాణా సంచా కాల్చారు. ఎక్కడ చూసినా నూతన సంవత్సర ఉత్సాహం కనిపించింది.





● నూతన సంవత్సరం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి ప్రసాదాన్ని అందజేస్తున్న మంత్రి సురేఖ, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, అర్చకులు

ఆధ్యాత్మిక నగరి గుట్టలో...

ఆధ్యాత్మిక నగరి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో నూతన సంవత్సర సందడి సోమవారం నెలకొంది. ఈ ఏడాది తొలిరోజునే స్వామి వారిని దర్శించుకోవాలన్న భక్తుల తపనకు తగ్గట్లుగా ప్రతి రోజు కన్నా అర గంట ముందుగానే నిత్యపూజలు ముగించి, దర్శనాలు ప్రారంభించారు. ఆలయ పరిసరాల్లో ఎక్కడ చూసినా భక్తులతో కిక్కిరిసింది.




సూర్యాపేటలో నూతన సంవత్సర వేడుకల్లో యువతులు



● స్వామి సన్నిధిలో సెల్ఫీ

యాదగిరి కొండపై తిరువీధుల్లో సెల్ఫీ తీసుకుంటున్న యువతులు



మెట్లమార్గంలో కొండపైకి చేరుకుంటున్న భక్తులు



నల్లగొండ జిల్లా కేంద్రంలోని బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

చెర్వుగట్టులో..



● నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులో రామలింగేశ్వర స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఈ ఏడాది అంతా ఓకేనా..



● జాతకం ఎలా ఉందో చూపించుకుంటున్న యువతులు

చింతపల్లి సాయిబాబా సన్నిధిలో



బాబా దర్శనం కోసం క్యూలైన్లలో బారిన భక్తులు

నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని నూతన సంవత్సరం సందర్భంగా సాయిబాబా ఆలయం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు బాబాదర్శనానికి తరలివచ్చారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే బాలునాయక్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు నూతన ఏడాది శుభాకాంక్షలు తెలిపారు.

● చింతపల్లి

పర్యాటక ప్రాంతం సాగర్‌లో

లాంచీ స్టేషన్ వద్ద పర్యాటకుల సందడి



ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. వరుస సెలవు దినాలు రావడం, సోమవారం నూతన సంవత్సరం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్‌కు వచ్చారు. రెండు రోజులుగా సాగర్‌లోని విజయవిహార్‌తో పాటు పలు ప్రైవేట్ అతిథి గృహాల్లో ఉంటున్న పర్యాటకులు ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకున్నారు. సోమవారం ఉదయం జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు పర్యాటకశాఖ లాంచీలో వెళ్లారు. నాగార్జునకొండకు రెండు లాంచీల ట్రిప్పులు నడిపినట్లు పర్యాటకశాఖ అధికారులు తెలిపారు. అంతేకాకుండా సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, విజయవిహార్, కొత్త వంతెన అనుపు, ఎత్తిపోతల తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. రెండు రోజుల్లో రెండు వేల మంది పర్యాటకులు పర్యాటక శాఖ లాంచీలో పర్యటించారు.

● నాగార్జునసాగర్

● భువనగిరి ఖిల్లా వద్ద..



భువనగిరి జిల్లా కేంద్రంలో ఖిల్లా వద్ద మెట్లమార్గంలో ఫొటోలు దిగుతూ సందడి చేస్తున్న పర్యాటకులు

తొలిరోజే విషాదాలు

● రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి ● నలుగురికి గాయాలు

కొత్త ఏడాది తొలిరోజైన సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారు.. మరో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.



గంజి శ్రీనివాస్(ఫైల్)

దేవరకొండ, జనవరి 1: నల్లగొండ జిల్లా దేవరకొండలో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం కొండమల్లేపల్లి పట్టణంలో అంబిక ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్ నడుపుతూ జీవనం సాగిస్తున్న గంజి శ్రీనివాస్(40) ఆదివారం రాత్రి వ్యక్తిగత పనులపై దేవరకొండకు వచ్చాడు. పని ముగించుకుని తిరిగి సోమవారం తెల్లవారుజామున వెళ్తుండగా కొండమల్లేపల్లి నుంచి దేవరకొండకు వస్తున్న ట్రాలీ వాహనం ఆయన బైక్‌ను ఢీ కొనడంతో శ్రీనివాస్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీనివాస్ మృతదేహానికి దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కాపాడిన ఎయిర్ బెలూన్స్



మృతుడు నటరాజ్, లారీ కిందికి దూసుకెళ్లిన కారు

సూర్యాపేటక్రైం: ముందున్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ఇద్దరికి ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌కు చెందిన ఉంటున్న మేకల నటరాజ్(45), స్నేహితులు ముక్కోళ్ల శ్రీనివాస్, బోదాస్ మల్లేష్‌లు సినిమా సెట్టింగ్‌లకు సీలింగ్ పనులు చేస్తూ కుటుంబాలను జీవనం సాగిస్తున్నారు. అందులో భాగంగా ముగ్గురు సోమవారం ఉదయం 6.30 గంటలకు మరో స్నేహితుడు వినోద్ కారును తీసుకుని విజయవాడకు బయలుదేరారు. మార్గమధ్యలో జిల్లా కేంద్రమైన సూర్యాపేట హైటెక్ బస్టాండ్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో వెనుక సీట్లో కూర్చున్న నటరాజ్ తలకు, ముఖానికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు ఎయిర్‌బెలూన్లు తెరుచుకోవడంతో ముందు కూర్చున్న శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు నడుపుతున్న మల్లేష్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కారు లారీ వెనుక చిక్కుకుపోవడంతో స్థానికులు వెంటనే కారులో ఉన్న వారిని బయటకు తీసి పోలీసులకు సమాచారమిచ్చారు. నటరాజ్‌కు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.



నాగేంద్రకుమార్ మృతదేహం

బైక్ అదుపు తప్పి...

భూదాన్‌పోచంపల్లి : యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో బైక్ అదుపు తప్పిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ విక్రంరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సైదులుపేట గ్రామానికి చెందిన కిల్లంపల్లి నాగేంద్రకుమార్(23) భార్య మణిమాధురితో కలిసి బతుకుదెరువు కోసం భూదాన్‌పోచంపల్లి పట్టణానికి వచ్చి ఇక్కడే నివాసముంటున్నారు. నారాయణగిరి సమీపంలోని రైసుమిల్లులో నాగేంద్రకుమార్ ఆపరేటర్‌గా పనిచేస్తుండగా, భార్య మణిమాధురి కూలీపని చేస్తోంది. ఆదివారం రాత్రి నాగేంద్రకుమార్ తన బైక్‌పై మిల్లులో పనిఉందని భార్యకు చెప్పి వెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం అతడు మిల్లు నుంచి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో భద్రావతికాలనీ సమీపంలోని మూలమలుపు వద్ద అతివేగంతో బైక్‌ను అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టాడు. ఈ సంఘటనలో నాగేంద్రకుమార్‌కు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మణిమాధురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

భువనగిరి రూరల్ : బైక్‌ను అతివేగంగా బైక్ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ వీ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని వీరవెల్లికి చెందిన సుర్వి ఇస్తారిగౌడ్ భువనగిరికి బైక్‌పై వస్తుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన ఇస్తారిగౌడ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వీరవెల్లి గ్రామానికి చెందిన శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

వలిగొండ మండలంలో

వలిగొండ : ట్రాక్టర్ ఢీ కొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల ప్రకారం రామన్నపేట మండలం పల్లివాడకు చెందిన ఎం మహేష్ తన బైక్‌పై పనినిమిత్తం వలిగొండ మండలం మల్లేపల్లికి వచ్చి తిరుగు ప్రయాణమయ్యాడు. వలిగొండ సమీపంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో మహేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమ్మితం 108 సిబ్బంది రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పెన్‌పహాడ్, జనవరి 1 : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగులపహాడ్ గ్రామానికి చెందిన నకిరేకంటి సైదులు(38) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబంతో జీవిస్తున్నాడు. ఇటీవల కుటుంబంలో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు వచ్చేసరికి మృతి చెందాడు. సైదులకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని ఎస్‌ఐ వెంకన్నగౌడ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

ఆత్మకూర్(ఎస్), జనవరి 1 : సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలో ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పాత సూర్యాపేట గ్రామానికి చెందిన కోమటిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి(38)కి 2014లో పావనితో వివాహమైంది. వారికి ఇద్ద కుమారులు ఉన్నారు. గత కొద్దిరోజుల నుంచి జీవనోపాధి కోసం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లిలో ఉంటున్నారు. 20 రోజుల క్రితం శివమాలధారణ వేసుకుని స్వగ్రామం పాతసూర్యాపేటలో ఉంటున్నాడు. డిసెంబరు 29న ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగి స్పృహ కోల్పోయాడు. కొద్దిసేపటికి గమనించిన ప్రశాంత్‌రెడ్డి తల్లి రమణమ్మ స్థానికుల సహాయంతో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రశాంత్‌రెడ్డి భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు.

ఖమ్మంలో సూర్యాపేట జిల్లా వాసి

ఖమ్మం క్రైం, జనవరి 1 : ఖమ్మం జిల్లా కేంద్రంలో రైలు కింద పడి సూర్యాపేట జిల్లా వాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూర్యాపేట జిల్లా ముకుందాపురం మండలం మునగాల గ్రామానికి చెందిన విలాసకవి నర్సింహారాజు(50) ఖమ్మం జిల్లా కేంద్రంలోని శ్రీనివాసనగర్ సమీపంలోని రైల్వేట్రాక్‌పై మృతి చెంది ఉండటాన్ని రైల్వే సిబ్బంది గుర్తించారు. వారు జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మంప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఎన్నికల నామ సంవత్సరం

▸▸ సార్వత్రిక ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు ▸▸ తేలనున్న సుమారు 18,661మంది నాయకుల రాజకీయ భవితవ్యం



ఈ నూతన సంవత్సరం పార్టీల నాయకులు, ప్రస్తుత ప్రజా ప్రతినిధులకు కీలకం కానుంది. పార్లమెంట్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థలకు ఎన్నికలు ఈ ఏడాదే జరుగనున్నాయి. ఈ క్రమంలో గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి నాయకుల వరకు అదృష్టాన్ని పరీక్షించుకునే కాలంగా ఈ ఏడాది నిలువనుంది. ఈ సంవత్సరం చివరి నాటికి ప్రజా ప్రాతినిధ్యం, రాజకీయ పార్టీల నాయకత్వంలో పెనుమార్పులు జరుగనున్నాయి. దీంతో ఏడాదంతా రాజకీయ రగడ నెలకొననుంది. ఈ ఏడాదిలో సాధించాల్సిన లక్ష్యాలను పలువురు నిర్దేశించుకోవడం సర్వసాధారణమైన నేపథ్యంలో రాజకీయ నాయకులు కూడా 2024 సంవత్సరంలో తమకు అంతా శుభమే కలుగాలని తొలి రోజు నుంచే ఆరాట పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

- భువనగిరి టౌన్

ఉమ్మడి జిల్లాలో సుమారు 18,661 మంది రాజకీయ భవిష్యత్‌ను నిర్ణయించే సంవత్సరం ఇది. ప్రస్తుత పార్లమెంట్ కాలపరిమితి మే నెలతో ముగిస్తుంది. ఆ లోపే సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలోని భువనగిరి, నల్లగొండ పార్లమెంట్ స్థానాల్లో రాజకీయ భవిష్యత్‌ను పలువురు పరీక్షించుకోనున్నారు.అదేవిధంగా ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో తన శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో అనివార్యమైన ఉపఎన్నిక కోసం ఎన్నికల కమిషన్ ఇటీవల ఓటరు జాబితా సవరణ షెడ్యూల్‌ను ప్రకటించింది. త్వరలోనే ఎన్నికల కు ఏర్పాట్లు జరుగుతున్నట్లు స్పష్టమైంది. అలాగే ప్రస్తుత సర్పంచ్‌ల పదవీకాలం ఈ ఏడాది జనవరి 31తో ముగియనుంది. దీంతో గడువు లోపు గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండడంతో కొద్దిమేర ఆలస్యంగా నిర్వహించే అవకాశం ఉంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని 1,740 గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు, సుమారు 15,660మంది వార్డుసభ్యుల రాజకీయ భవిష్యత్‌ను ఈ ఏడాది నిర్ణయించనుంది. అలాగే ప్రస్తుత ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల కాల పరిమితి మే నెలతో ముగుస్తుంది.దీంతో ఉమ్మడి జిల్లాలోని 74 మండలాల పరిధిలోని 764 మంది ఎంపీటీసీలు, 74 మంది జడ్పీటీసీల, ఎంపీపీల, వైస్‌ఎంపీపీల రాజకీయ భవిష్యత్‌లు కూడా 2024 సంవత్సరం నిర్ణయించనుంది. ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీలకూ ఈ ఏడాది చివరి నాటికి ఎన్నికలు నిర్వహించడం అనివార్యం కానుంది. దీంతో 420 మంది కౌన్సిలర్లు, 19 మంది చైర్మన్లు, వైస్‌చైర్మన్ల రాజకీయ భవితవ్యం నిర్ణయం కానుంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లా	మునిసిపాలిటీలు	వార్డులు	మండలాలు	ఎంపీటీసీలు	జడ్పీటీసీలు	గ్రామాలు
నల్లగొండ	8	177	34	345	34	844
యాదాద్రి	6	104	17	184	17	421
సూర్యాపేట	5	139	23	235	23	475
మొత్తం	19	420	74	764	74	1740



రాజకీయ పార్టీల్లోనూ

ప్రజాప్రతినిధుల భవిష్యత్‌తో పాటు రాజకీయపార్టీలకు నాయకత్వం వహిస్తున్న నాయకులకు ఈ ఏడాది కీలకంకానుంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సీఎం గా పదవీ ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి త్వరలోనే నూతన టీపీసీసీ అధ్యక్షుడు రానున్నారని ప్రచారం అవుతున్న విషయం విదితమే. దీంతో ఉమ్మడి జిల్లాలోని 3 జిల్లాల ప్రస్తుత అధ్యక్షులు డీసీసీ అధ్యక్షులు కూడా మారే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల అధ్యక్షుల మార్పు తథ్యమని బీజేపీ ఇస్తున్న లీకేజీలతో ఆ పార్టీలో హడావిడి నెలకొంది. జిల్లా నాయకత్వం తో పాటు ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర నాయకులుగా చెలామణి అవుతున్న నాయకులకు ఈ ఏడాది పరీక్ష పెట్టనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవానికి గురైన బీఆర్‌ఎస్ కూడా సంస్థాగత మార్పులకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అలాగే వామపక్షాల నాయకత్వం మార్పుపై కూడా విస్తృతంగా చర్చ సాగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది రాజకీయ నాయకుల పార్టీ నాయకత్వంలో పెనుమార్పులు జరిగే అవకాశాలు ఉండే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

ఉద్యమాలే ఊపిరిగా జీవించిన కమలమ్మ


ఆరుట్ల కమలాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆలేరు రూరల్, జనవరి 1: ఉద్యమాలే ఊపిరిగా జీవితాంతం ప్రజల పక్షాన నిలిచి పోరాడిన గొప్పనేత ఆరుట్ల కమలాదేవి అని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు కొనియాడారు. సోమవారం మండలంలోని కొలనుపాకలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఆరుట్ల కమలాదేవి 29వ వర్ధంతిని నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ తెలంగాణలో ఆరుట్ల దంపతులు పోరాటం చేయని గ్రామాలే లేవన్నారు. సమ సమాజం కోసం సోషలిస్ట్ రాజ్యం కోసం నిరంతరం ఉద్యమాలు చేశారన్నారు. అసెంబ్లీలో తొలి మహిళా ప్రతిపక్ష నేతగా కొనసాగి ప్రజల మనసులు చురగొన్నారన్నారు. ఆరుట్ల దంపతుల చరిత్రను పాఠ్యాంశాలలో ముద్రించాలని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు చెక్క వెంకటేష్, ఆరుట్ల సుశీలాదేవి, కొల్లూరి రాజయ్య, కనకయ్య, శ్రీకాంత్‌రెడ్డి, బాలయ్య, రవి, రాజు, పరుశరాములు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పూజలు

మోత్కూరు, జనవరి 1: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి వచ్చేలా కరుణించాలని కోరుతూ సోమవారం మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు చెందిన కాంగ్రెస్, యూత్‌కాంగ్రెస్ నాయకులు మోత్కూరు శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అన్నదానం చేశారు. మార్కెట్ మాజీ చైర్మన్ వల్లంభట్ల పూర్ణచందర్‌రావు, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, కారుపోతుల వెంకన్న, కప్పల రాజేష్, వంగాల సత్యనారాయణ, కొమ్ము సత్యనారాయణ, సర్పంచులు పైళ్ల విజయనర్సిరెడ్డి, నిమ్మనగోటి జోజి, నారగోని అంజయ్య, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు గుండిగ జోసఫ్, మోత్కూరు పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ఆనందమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

చౌటుప్పల్ టౌన్ : ఆధ్యాత్మికతను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని జిల్లా ఆహార పదార్థాల తనిఖీ అధికారి సుమన్ కల్యాణ్ అన్నారు. సుమన్ కల్యాణ్ సోమవారం స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో ఇరుముడి కట్టుకొని శబరిమలై బయలుదేరి వెళ్లారు.

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలంను సీపీఎం నుంచి బహిష్కరించారు. పార్టీ నిర్ణయాలను ధిక్కరించినందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని సీపీఎం మునిసిపాలిటీ కార్యదర్శి బండారు నర్సింహ ధ్రువీకరించారు. ఇదిలా ఉండగా సీపీఎం నుంచి బహిష్కరించిన విషయం తనకు తెలియదని మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం తెలిపారు.

రామన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. ధర్మారెడ్డి, పిలాయిపల్లి, బునాదిగాని కాల్వలు పూర్తి చేసి రైతాంగానికి నీరందివ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అంబటి సురేందర్ రెడ్డి, బల్గూరి అంజయ్య, అంబటి మల్లారెడ్డి, బీరప్ప, కందుల యాదిరెడ్డి, కూనూరు వెంకటేశం, కూనూరు గణేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

రామన్నపేట: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డులో ఉచితంగా ప్రవేశం కల్పించి, పెండింగ్‌లో ఉన్న క్లైములను పూర్తి చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొరిగె సోములు అన్నారు. మండల కేంద్రంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాసాల రమేష్, గొరిగె ఆది మల్లయ్య, గొరిగె మల్లేష్, దుర్గ నర్సింహ, కొల్లూరు నాగరాజు, తరిగొప్పుల వెంకట్‌రెడ్డి, తన్నీరు కృష్ణారావు, నూకల సైదులు, వల్లూరు బలయ్య, నాగేశ్వర్‌రావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట: రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన గర్దాసు సురేష్ టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన పెద్దలకు సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

అడ్డగూడూరు: కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని వేల్దేవి గ్రామానికి చెందిన రొడ్డ మల్లేష్ నియామకమయ్యారు. ఈ మేరకు టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్‌రెడ్డిదామోదర్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దుర్గాయి హరిప్రసాద్ నియామాక పత్రాన్ని మల్లేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలెబోయిన లింగయ్య ఉన్నారు.

భువనగిరి రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కుందారపు కృష్ణాచారి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల వరకు టీడీపీని మరింత బలోపేతం చేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పేర్కొన్నారు.

భువనగిరి రూరల్: ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

భువనగిరి టౌన్: నాలుగో తరగతి ఉద్యోగుల సెంట్రల్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా భువనగిరికి చెందిన ఎండి.అఫాన్ నియమితులయ్యారు. భువనగిరిలోని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సబార్డినేట్‌గా పని చేస్తున్న అఫాన్‌కు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ హైదరాబాద్‌లో నియామక పత్రం అందజేశారు.

ఆలేరు రూరల్ : ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తమ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులను ఇవ్వాలని కోరారు.

ఆలేరు రూరల్: ఆలేరులో నిర్మిస్తున్న హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం కోసం టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.7.51 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలేరులో జరిగిన మహాపడి పూజలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర శర్మ, యాట శివ, ఎంపీటీసీ ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు ఆరె ప్రశాంత్‌గౌడ్, కిషోర్, భక్తులు పాల్గొన్నారు.

రామన్నపేట: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను రామన్నపేట మండల కాంగ్రెస్ నాయకులు క్యాంప్ కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంలు తెలిపారు. ఈ సందర్భంగా పూల బొకేలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

- ముగ్గులతో కొత్త సంవత్సరానికి స్వాగతం
- ఆలయాల్లో భక్తుల సందడి
- సాయిబృందావనంలో భక్తుల సందడి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకలు సోమవారం భూదాన్‌పోచంపల్లి పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి ముంగిళ్లలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ముగ్గులు వేశారు. మండల వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని సాయిబృందావనం క్షేత్రంలోని సాయిబాబా ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంటనగరాలైన హైద్రాబాద్, సికింద్రాబాద్‌తోపాటు పరిసర రంగారెడ్డి, నల్లగొండ, మేడ్చల్ జిల్లాల భక్తులు వేలాదిగా తరలి వచ్చి సాయిబృందావనం షిర్డీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. విశ్వశాంతి సాయి


సాయిబృందావనంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఘంటా నారాయణస్వామిజీ

సేవా, ప్రచార్ సమాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ ఘంటా నారాయణస్వామిజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఆవరణ భక్తులతో కిటకిటలాడింది. ఈ ఉత్సవాల్లో ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ ఘంటా నారాయణస్వామిజీ తోపాటు ఆర్ విజయలక్ష్మీ, స్థానిక సర్పంచు దుర్గం స్వప్న నరేష్, ఎంపీటీసీ చిల్లర జంగయ్యాయాదవ్ పాల్గొన్నారు. కాగా, మండల పరిధిలోని కనుముకుల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో కనుముకుల ఆలయ నిర్మాణకర్తలు కోట మల్లారెడ్డి-పుష్పలత, లక్ష్మీనారాయణస్వామి ఆలయం కమిటీ చైర్మన్‌లు అంకం యాదగిరి మాజీ చైర్మన్లు గునిగంటి మల్లేష్‌గౌడ్, కొయ్యడ నర్సింహగౌడ్, మార్కండేశ్వరస్వామి దేవాలయం అధ్యక్షుడు బడుగు చండికేశ్వర్, ఉపాధ్యక్షుడు బోగ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రుద్ర బాలరాజు, కోశాధికారి మంగళపల్లి రాజారమేష్, ధర్మకర్తలు గోలి యాదగిరి, పాలాది యాదగిరి, భారత బాలరత్నం, సిద్దిరాములు పాల్గొన్నారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం రాత్రి నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో రాచకొండ కమీషనర్ ఆఫ్ పోలీస్ సుధీర్‌బాబు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీసీపీ రాకేష్ చంద్ర, ఏసీపీ మొగులయ్య, సీఐలు యాదగిరి, మహేష్, ఎస్ఐలు విక్రంరెడ్డి, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు. సీపీ సుధీర్‌బాబుకు స్వాగతం పలికి మొక్కను ఇచ్చి స్వాగతించారు.

మోత్కూరు : మోత్కూరులోని శ్రీరామలింగేశ్వర స్వామి, శ్రీవెంకటేశ్వర స్వామి, సాయిబాబా, ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని పాలడుగు సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. గత నెల 31న ఆదివారం రాత్రి పలువురు పలుచోట్ల బంధువులు, స్నేహితులు బృందాలు కూర్చొని విందులు చేసుకుని అర్ధరాత్రి (12 గంటలు)దాటగానే కేక్‌కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలిపారు.

చౌటుప్పల్ టౌన్ : పట్టణంలోని పలు దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమాల్లో బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి బాల్యం వెంకటాచలం, అయ్యప్ప స్వామి దేవాలయం చైర్మన్ బి.మురళి, మునిసిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.శ్రీధర్ బాబు, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ సైదులు, దండ అరుణ్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయం మాజీ చైర్మన్ ఊడుగు మల్లేశ్, రామాలయం మాజీ చైర్మన్ డి.గోవర్ధన్‌రెడ్డి, భక్తాంజనేయ స్వామి దేవాలయ అధ్యక్షుడు సందగళ్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఊడుగు రమేశ్ పాల్గొన్నారు. చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధి తంగడపల్లిలోని ఇంద్రపాల ముత్యాలమ్మ దేవాలయం వద్ద నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం రాత్రి మంది వ్యవసాయ మహిళా కూలీలు కేట్ కట్ చేశారు.


చౌటుప్పల్‌లోని ఇంద్రపాల ముత్యాలమ్మ దేవాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న వ్యవసాయ మహిళా కూలీలు

గుండాల: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని శిర్డీసాయిబాబా, సీతారాంపురం గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి, సుద్దాలలో వేణుగోపాల స్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు శ్రీనివాసశర్మ, వేణుగోపాల చార్యులు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్/ వలిగొండ: మండలంలోని నమాత్‌పల్లిలో గల పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావి సురేందర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, టీపీసీసీ సభ్యులు తంగెళ్లపల్లి రవికుమార్, ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి యాదవ్, బి రాములు గౌడ్, ఆలయ నిర్మాణ దాత ముసలి ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ మట్టపారిజాత శంకర్ బాబు, సర్పంచ్ ఎల్లంల శాలిని జంగయ్యయాదవ్ పాల్గొన్నారు. వలిగొండ మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలో కొలువుదీరిన మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్‌రాజు, వైస్‌ఎంపీపీ ఉమా బాలనర్సింహ, సర్పంచ్ బోళ్ల లలితా శ్రీనివాస్, నాయకులు వాకిటి అనంతరెడ్డి, పాశం సత్తిరెడ్డి, యుగేందర్‌రెడ్డి, కంకల కిష్టయ్య, నరేష్‌రెడ్డి, అశోక్, వెంకటేశం, అంజిరెడ్డి, మల్లేశం, నరేష్, రమేష్, రాములు, ప్రవీణ్, ఈవో మోహన్‌బాబు, అర్చకులు పాల్గొన్నారు.

రామన్నపేట: మండలంలోని మునిపంపుల గ్రామంలో పొలాల్లో వరి నాట్లు వేసే మహిళలు పనిచేస్తూనే కొద్దిసేపు ఆగి కేకు కట్‌చేసి మళ్లీ పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. తాళ్లపల్లి దుర్గయ్య, ధనలక్ష్మి, బూడిది లక్ష్మి, పార్వతమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

మోటకొండూరు: మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా విద్యార్థినులు 2024 ఆకారంలో కూర్చున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, మమత, లక్ష్మీప్రభ, నవనీత, గీత, ఉదయ, ఉష, సృజన సంధ్య తదితరులు ఉన్నారు.


రామన్నపేట మండలం మునిపంపులలో కేక్ కట్‌చేస్తున్న వరినాట్లు వేసే మహిళలు


వలిగొండ: మత్స్యగిరి ఆలయంలో హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి


మోటకొండూరులోని గురుకుల పాఠశాల విద్యార్థుల నూతన సంవత్సర ప్రదర్శన

చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులకోసం పోటీ

- అవిశ్వాస రాజకీయాలలో కొత్త పరిణామం
- మద్దతు కూడగట్టుకునేందుకు ముమ్మర యత్నాలు



భువనగిరి టౌన్, జనవరి 1: భువనగిరి మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసులు అందజేసిన 31 మంది కౌన్సిలర్లలో అప్పుడే ఆ రెండు పదవులకు పోటీ ప్రారంభమైనట్లు ప్రచారం అవుతోంది. దీంతో వారిలో అనుమానాలు కూడా పొడసూపుతున్నట్లు ప్రచారం అవుతోంది. 35 మంది సభ్యులకు గాను 31 మంది సంతకాలతో అవిశ్వాస తీర్మానం నోటీసును అదనపు కలెక్టర్‌కు అందజేసిన నేపథ్యంలోనే త్వరలోనే నిర్వహించే ప్రత్యేక సమావేశంలో అవిశ్వాస తీర్మానం నెగ్గడం, ప్రస్తుత చైర్మన్, వైస్‌చైర్మన్ గద్దె దిగడం సుమారుగా పక్కా కావడంతో ఆ రెండు పదవులను ఆశిస్తున్న ఆశావాహుల సంఖ్య క్రమేపీ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. పాలకపక్షంగా ఉన్న 20 మంది బీఆర్ఎస్ సభ్యుల్లో అవిశ్వాస తీర్మానం నోటీసుపై అదే పార్టీకి చెందిన 16 మంది కౌన్సిలర్లు సంతకాలు చేయగా 9 మంది కాంగ్రెస్, ఆరుగురు బీజేపీ కౌన్సిలర్లు సంతకాలు చేశారు. అయితే చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్య వైఖరిని నిరసిస్తూ అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించాం కానీ తమకు పార్టీపై వ్యతిరేకత లేదని పార్టీని వీడేది లేదని పేర్కొంటున్న ఆ 16 మంది కౌన్సిలర్లు చైర్మన్, వైస్‌చైర్మన్ స్థానాలు తిరిగి తమ పార్టీకే దక్కాలనే దృఢ వైఖరితో ఉన్నట్లు సమాచారం. అవసరం అయితే నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక సమయంలో అవిశ్వాస తీర్మానంతో పదవులను వీడనున్న చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేయని మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతును కూడగట్టుకుంటామని పేర్కొంటుండడం గమనార్హం. అవిశ్వాస తీర్మాణం ప్రయత్నాలలో ముఖ్యుడుగా ప్రచారం అవుతున్న ఓ కౌన్సిలర్‌తో పాటు మరో ముగ్గురు ఆ రెండు పదవుల్లో ఏ ఒక్కటైనా దక్కించుకోవాలనే లక్ష్యంతో ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో అధికారంలో ఉండడం, స్థానికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉండడంతో ఎలాగైనా మునిసిపాలిటీపై తమ పార్టీ జెండాను ఎగురవేయాలని మునిసిపాలిటీలో 9మంది సంఖ్యా బలం ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు పట్టుదలగా ఉన్నట్లు ప్రచారం అవుతోంది. అయితే చైర్మన్ పదవిని ఆశిస్తున్న ఆ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు ఎవరికి వారుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మెప్పు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం అవుతోంది. స్వపక్షం నుంచే కాక విపక్షాల మద్దతు కూడగట్టుకునేందుకు కాంగ్రెస్ ఆశావాహులు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు పలువురు అంటున్నారు. కొంద రు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. కాగా అవిశ్వాస రాజకీయాలు, నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికల్లో తామె కీలకం అవుతామని పేర్కొంటున్న బీజేపీ కౌన్సిలర్లలో ఒకరు చైర్మన్ లేదా వైస్‌చైర్మన్ పదవిపై కన్నేసినట్లు తెలుస్తోంది. ఇందు కోసం అందరితో సంప్రదింపులు చేస్తున్నట్లు ప్రచారం అవుతోంది. అయితే ఆ రెండు పదవులపై ఆశలేని కౌన్సిలర్లు మాత్రం చైర్మన్, వైస్‌చైర్మన్ పదవుల ఆశావహులతో టచ్‌లో ఉంటూ తమ మైలేజీని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

ఇంటింటికీ అయోధ్యరాముడి అక్షింతలు



భువనగిరిలో అయోధ్య అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు


జిల్లా కేంద్రంలో అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

భువనగిరి టౌన్/ మోత్కూరు/ సంస్థాన్ నారాయణపురం/భూదాన్‌పోచంపల్లి/ అడ్డగూడూరు, జనవరి 1: ప్రతీ రామ భక్తుడి ఇంటికి అయోధ్య రాముడి అక్షింతలను అందించడమే లక్ష్యమని విహెచ్‌పి జిల్లా కార్యదర్శి శ్రీశైలం, భువనగిరి పట్టణ అధ్యక్షుడు కేమోజు మల్లికార్జున్ తెలిపారు. భువనగిరి పట్టణం, మండలంలోని వడాయి గుడెంలో అక్షింతలకు పూజలు చేసి ఊరేగిస్తూ ఇంటింటికీ పంపిణీ చేశారు. మోత్కూరు పట్టణంలో అక్షింతల పంపిణీపై ప్రజల్లో మంచి స్పందన ఉందని మోత్కూరు మండల సంయోజక్ కాంబోజు మహేంద్ర తెలిపారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని అల్లందేవి చెరువు గ్రామంలో అక్షింతలు, శ్రీరాముడి చిత్రపటాలను, కరపత్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని గడప గడపకు అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో నాయకులు ప్రారంభించారు. గోరక్షక్ జిల్లా ప్రముఖ్ బల్ల దుర్వాసులు, భజరంగ్‌దళ్ సంయోజక్ విడెం సాయి, పద్మ పురోహిత సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర పాండురంగ శాస్త్రి పాల్గొన్నారు. అడ్డగూడూరు మండలంలోని చౌళ్ల రామారం గ్రామంలో అయోధ్య రామయ్య అక్షింతలను కులాల అతీతంగా గడపగడపకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సంయోజక్ మురళి మనోహర జగన్నాధం, కంబాల మల్లేష్, తోట సుజాత, మెట్టు కవిత, కొమ్మిడి జ్యోతి ఉన్నారు.

అద్దె అవస్థలు ఇంకెన్నాళ్లు?

- ఇరుకు భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- పక్కా భవనానికి దాత స్థలం ఇచ్చి ఏడేళ్లు..
- అయినా మంజూరు కాని నిధులు
- సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న సిబ్బంది, ప్రజలు


ఇరుకు భవనంలోనే కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం


పక్కా భవన నిర్మాణానికి రైతు విరాళంగా ఇచ్చిన స్థలం ఇదే

బీబీనగర్, జనవరి 1: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరానికి చేరువలో పారిశ్రామిక పట్టణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కేంద్ర బిం దువుగా మారిన బీబీనగర్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం లేదు. దీంతో విధుల పరంగా కార్యాలయ సిబ్బంది, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారు. బీబీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 2007లో ఏర్పాటు అయినప్పటి నుంచి నేటి వరకు 15 సంవత్సరాలుగా ఇరుకైన అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నారు. నిత్యం వందలాది రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. క్రయ విక్రయదారులు వందల సంఖ్యలో కార్యాలయానికి వస్తుంటారు. వసతి సౌకర్యాల పరంగా నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అయితే ఇంత కాలం అన్ని విధాలుగా అనుకూలమైన స్థలం దొరకని కారణంగా పక్కా భవనానికి నిధుల విడుదల ఆలస్యం అవుతోందని సంబంధిత అధికారులు ఇంత కాలం చెప్పుకుంటూ వస్తున్నారు.

స్థలం ఇచ్చి ఏడేళ్లయినా..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి స్థలం దొరక్క ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన మంగ మల్లయ్య అనే రైతు ఆయన కుమారుల సహకారంతో తనకున్న భూమిలో కొంత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉచితంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డులో సుమారు 1.50కోట్ల విలువ చేసే 506 గజాల స్థలాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పేరిట 2016 సెప్టెంబరు 1న రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి స్థల సేకరణ ఇబ్బంది తొలగిపోయింది. స్థలం ఇచ్చి ఏడు సంవత్సరాలు గడిచిపోతున్నా నేటికీ నిధులు మంజూరు కాకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రిజిస్ట్రేషన్ల రూపంలో కోట్లాది రూపాయలను ఆశిస్తున్న ప్రభు త్వం నిధులు కేటాయించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సంవత్సరం 2016 జూన్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా సొంత భవనాలు లేని 39సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రభుత్వం గుర్తించి ఒక్కో భవనాన్ని రూ.64లక్షలతో నిర్మించేందుకు నిర్ణయించిన జీవో నెంబర్ 92ను విడుదల చేసింది. అయితే ప్రభుత్వం ఎంపిక చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు లేని జాబితాలో బీబీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లేకపోవడంతో అప్పుడే స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. 2007 అక్టోబరు నుంచి అద్దె భవనంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కొనసాగిస్తూ కొన్ని నెలల క్రితం వరకు నెలకు రూ.5,412 అద్దె చెల్లించారు. ఇటీవలే రూ. 6,578కి పెంచి అద్దె చెల్లిస్తున్నారు.

నిధులు మంజూరు చేయండి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనానికి అనువైన స్థలం దొరక్కపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిసి బ్రాహ్మణపల్లి రోడ్డులో నాకున్న భూమిలో కొంత 506గజాల స్థలాన్ని కుమారుల సహకారంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇచ్చేందుకు ముందుకు వచ్చాం. 2016లోనే రిజిస్ట్రార్ పేరిట స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశాం. ఏడేళ్లు కావస్తున్నా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేయాలి. లేదంటే స్థలాన్ని తిరిగి ఇవ్వాలి.

- మంగ మల్లయ్య, రైతు స్థలదాత

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం



ప్రస్తుతం ఇరుకైన పాత భవనంలోనే విధులు నిర్వహిస్తున్నాం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి స్థలం లేక ఇంత కాలం నిధుల మంజూరులో జాప్యం జరిగినట్లు నా దృష్టికి వచ్చింది. పట్టణానికి చెందిన ఓ రైతు పక్కా భవన నిర్మాణానికి అవసరమైన స్థలం ఇచ్చినట్లు నాకు తెలిసింది. నిధుల మంజూరు కోసం జిల్లా రిజిస్ట్రార్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. రోజూ కార్యాలయానికి వచ్చే క్రయ విక్రయదారులకు పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. పక్కా భవనానికి నిధులు మంజూరయ్యే వరకు తాత్కాలికంగా మరో అనువైన చోటుకు కార్యాలయాన్ని తరలించే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా.

- బలరాం, సబ్ రిజిస్ట్రార్ బీబీనగర్